క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వొడితెల కుటుంబ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు, కృష్ణారావు దంపతులు, వొడితెల కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

టీషర్ట్స్ అందజేత



వలంటీర్స్‌కు టీషర్ట్స్ అందజేస్తున్న సీఐ

హుజూరాబాద్: పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క–సారలమ్మ జాతరలో సేవలందించేందుకు ప్రభుత్వ, వాగ్దేవి డిగ్రీ కళాశాలల విద్యార్థులు గురువారం వచ్చారు. కాగా టౌన్ సీఐ బొల్లం రమేశ్ వలంటీర్స్ టీషర్ట్స్, విజిల్స్ అం దజేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, ఎస్‌ఐ రాజు ఉన్నారు.

హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లు తొలిగిస్తున్న అధికారులు

జమ్మికుంట: పట్టణంలోని అబాది జమ్మికుంటలోని అనుమతి లేని లేవుట్ల హద్దురాళ్లను మున్సిపల్ కమిషనర్ అయాజ్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం తొలిగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అనుమతి లేని లేవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ఇంటి పర్మిషన్, మున్సిపల్ సౌకర్యాలు పొందలేరని, ప్లాట్ల వ్యాపారులు భూములను లేవుట్ చేసేవారు మున్సిపల్ కార్యలయానికి వచ్చి చట్ట ప్రకారం అనుమతులు పొందాలని ఆతర్వాతే ప్లాట్లు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఎస్‌ఈ గంగాధర్

సైదాపూర్: మండలంలోని అమ్మనగుర్తిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గురువారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ గంగాధర్ స్థల పరిశీలన చేశారు. గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేశారని, స్థలం చూసి, నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వెంటనే అమ్మనగుర్తికి వెళ్లి ఎంపీటీసీ లంకదాసరి అరుణమల్లయ్యతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలం చూశారు. పనులు చేపడతామని గంగాధర్ తెలిపారు. వెంట డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఏ శ్రీనివాస్, ఏఈ ఆంజనేయులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్

గన్నేరువరం: మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ పీఆర్‌ఓ ఏనుగుల మహేందర్ మామ, మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన దర్శనాల చొక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, శ్రీకాంత్, మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల శివారులో కరీంనగర్– వరంగల్ ప్రధాన రహదారిపై గురువారం లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలులు.. చెంజర్ల గ్రామ శివారులోని ఓ దాణా కంపెనీలో పనిచేస్తున్న కొండపల్కలకు చెందిన ప్రశాంత్ (40) శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన ప్రసాద్ (43) ద్విచక్ర వాహనంపై చెంజర్ల వైపు వస్తుండగా వరంగల్ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వెంటనే 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

గద్దెపై కొలువుదీరిన సమ్మక్క

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ఆయా గ్రా మాల్లో సమ్మక్క సారక్క జాతరలో భాగంగా బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపై కొలువు తీరారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలవకుండా అధికారులు జాతర కమిటీ నిర్వాహకులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మానకొండూర్ మండలం కొండపల్కల, వేగురుపల్లి–నీరుకుల్ల గ్రామాలలో సమ్మక్క సారలమ్మ జాతరను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించి, అమ్మవార్లకు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఊటూరు గ్రామంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి కేశవపురం, మండలంలోని తనుగుల,వావిలాల గ్రామాల్లో సమ్మక్కను కోయ పూజారులు, డప్పుచప్పుళ్ల, మేళతాళాల మధ్య గద్దెపై ప్రతిష్ఠింపజేశారు. భక్తులకు వైద్యం,నీరు, ఉండడానికి టెంట్లు వేసి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని కిరాణం, బెల్లం షాపుల వద్ద ఎత్తు బంగారం కొనుగోళ్లు జోరుగా సాగాయి. శంకరపట్నం మండలంలోని సమ్మక్క–సారలమ్మ జాతరను ఎమ్మెల్యే సత్యనారాయణ సందర్శించారు. ఎత్తు బంగారం అమ్మవార్లకు సమర్పించి భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారు. జాతరలో సంజీవని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి సౌకర్యాన్ని ప్రారంభించారు. హుజూరాబాద్ రంగనాయకుల గుట్ట ప్రాంతం భక్తజన సంద్రంగా మారింది. పెద్దపాపయ్యపల్లి గ్రామం నుంచి కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, కుంకుమ భరణి రూపంలో ఉన్న అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఇల్లందకుంట మండలం మల్యాల సమ్మక్క సారలమ్మ జాతర శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. గురువారం సమ్మక్కను ఊరేగింపుగా గద్దె వద్దకు చేర్చడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



శంకరపట్నంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బంగారం తూకం



జమ్మికుంటలో బంగారం కొనుగోళ్లు



ఇల్లందకుంట: మల్యాలలో గద్దెపైకి చేరుకున్న సమ్మక్కతల్లి



ఇల్లందకుంట: మల్యాలలో సమ్మక్కను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



సమ్మక్కను గద్దెపైకి తీసుకువస్తున్న కోయ పూజారులు, భక్తులు



చొప్పదండి పట్టణంలో సమ్మక్కను గద్దెపైకి తీసుకువస్తున్న భక్తులు



హుజూరాబాద్: పెద్దపాపయ్యపల్లి నుంచి సమ్మక్కను గద్దెపైకి తెస్తున్న పూజారులు



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో అమ్మవారి గద్దెలవద్ద గ్రామస్తులు



హుజూరాబాద్‌లో సమ్మక్క రాకతో భక్తుల పూనకాలు

అడుగంటుతున్న భూగర్భజలాలు

- రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- ఎండిపోయే స్థితిలో బోరుబావుల కింద సాగవుతున్న వరి
- ఆందోళనలో అన్నదాతలు
- మండలంలో యాసంగి సాగు 16,151 ఎకరాలు



నావులకుంటలో అడుగంటుతున్న నీరు

రామడుగు: చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండటంతో పంటలు ఎలాగైనా పండుతాయని రైతులు సంతోషంతో వరిసాగు చేశారు. కానీ వారం రోజులగా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో చెరువులు, కుంటల్లో నీరు అండుగంటి పోతోంది. అలాగే బోరుబావుల్లో నీటి ఊటలు తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని 23 గ్రామాలలో యాసంగిలో వరి 15704, మొక్కజొన్న 401, వేరుశనగ 13.25, సన్‌ఫ్లవర్ 17.17, పప్పుదినుసులు 10 ఎకరాల్లో సాగు చేశారు. మండలంలో వన్నారం, కొక్కెరకుంట గ్రామాలకు మాత్రమే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతోంది. మిగతా గ్రామాల్లో రైతులు వ్యవసాయ, బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేశారు. వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండటంతో భూగర్భజలాలు పెరిగాయి. యాసంగి సాగుకు ఢోకా ఉండదని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయ్యేలా ఉంది. వారం రోజులుగా ఎండలు ముదురుతుండటంతో బావులు, బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గిపోయాయి. నాటి వేసిన వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు చాలా కిందికి పడిపోయాయని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణరెడ్డి తెలిపారు. వారం రోజుల నుంచి ఎండలు దంచికొడుతుండటంతో వరికి ఆరుతడిగా నీరు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట పొట్ట దశలో ఉందని, ఈ దశలో నీరు సంవృద్ధిగా అందకపోతే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని కోరట్‌పల్లికి చెందిన రైతు లక్ష్మీకాంతారెడ్డి వాపోయాడు. మండలంలో పలు గ్రామాలలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో గంగాధర మండలంలోని నారాయణపూర్ చెరువుకు గండి పెట్టి రామడుగు మండలంలోని మోతె వాగుకు నీటిని రైతులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని మోతె మాజీ సర్పంచ్ అంబటి నారాయణ తెలిపారు. మూడు రోజుల క్రితం రైతులు చెరువుకు గండి పెట్టి వాగులోకి నీటిని తెచ్చుకోవడంతో షానగర్, రామడుగు, కోరటపల్లి, మోతె, గాండ్లపల్లి, రుద్రారం, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల రైతులకు కొంత ఊరట కలిగింది.

నీళ్లు ఇంకిపోయాయి



వారం రోజులుగా ఎండలు ముదరడంతో పొలం పక్కనున్న నావులకుంటలో నీళ్లు పూర్తిగా ఇంకిపోయాయి. దీంతో మా బావుల్లో నీళ్లు తక్కువ అయ్యాయి. నాలుగెకరాల్లో వరి వేశాను. వారం కింది వరకు బాగానే పారింది. ఇప్పుడు వరి పంటకు నీళ్లు అందని పరిస్థితి వచ్చింది.

– వంగళ భూంరెడ్డి, రైతు, వెదిర

నష్టపోతాం..



బావుల్లో మంచిగా నీళ్లు ఉన్నాయని రెండెకరాల్లో వరి వేశాను. పది రోజల కింది వరకు బాగానే పారింది. నాలుగైదు రోజుల నుంచి కింది మడి వరకు నీళ్లు పారడంలేదు. ఆరుతడి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. నెల రోజుల్లో పంట చేతికందుతుంది. లేకపోతే నష్టపోవాల్సిందే.

– ముత్త జలపతి, రైతు, గణేశ్‌నగర్

మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు ఉదయ్, రాము, వెంకటేశం

గన్నేరువరం: మండలంలోని యాస్వాడ ఏనెగుట్ట నుంచి కరీంనగర్‌లోని ఎల్ఎండీ కట్ట సమీపంలోని లారెన్స్ స్కూల్ వెనకాల వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ బ్రిడ్జి నిర్మాణ పోరాట సమితి (జేఏసీ) చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ నుంచి ఎలగందుల వరకు ఉన్న పాతరోడ్డు నుంచి గన్నేరువరం మండలంలోని యాస్వాడ వరకు ఏ విధంగా బ్రిడ్జి నిర్మాణం అనుకూలంగా ఉంటుందో సంబంధిత అధికారులతో సర్వే చేపట్టాలని కోరారు. ఎల్ఎండీ నిర్మించకముందు మండలం నుంచి కరీంనగర్‌కు కేవలం 13 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండేదని, నిర్మాణం అనంతరం 40 కిలోమీటర్ల దూరం పెరిగిందని, మండలం నుంచి నిత్యం వేలాది మంది కూలీలు, ప్రజలు వివిధ పనులు, అవసరాల నిమిత్తం, విద్యార్థులు చదువుకోసం వెళ్లుతుంటారని, బస్సు చార్జీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2015లో అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ 10 మంది సర్పంచులతో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. మైలారం గుట్ట సమీపంలో 3,500 ఎకరాల వరకు ప్రభుత్వం ఉందని, బ్రిడ్జి నిర్మిస్తే భూములు వాడుకలోకి వస్తాయని, గన్నేరువరంతో పాటు బెజ్జంకి ఇల్లంతకుంట మండలాల ప్రజలకు బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, కోశాధికారి గుండ వెంకటేశం, కొట్టె రవి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు



అమ్మవార్లను దర్శించుకుంటున్న అధికారులు

హుజూరాబాద్‌రూరల్: జాతర సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎస్‌ఈ గంగాధర్ అన్నారు. మండలంలోని జూపాక గ్రామంలోని సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. విద్యుత్ సరఫరా గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్నారు. వెంట డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ పి.శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

‘ఒకరికి బదులు మరొకరిని పిలుస్తారు’



జమ్మికుంట: వారిద్దరూ కవలలు చిన్ననాటి నుంచి పద్ధతులు, వ్యక్తిత్వం ఒకటే. చదువులో 0.1శాతం తేడాతో మార్కులు సాధిస్తున్నారు. మరోవైపు అందరూ కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు చాలా రోజుల తర్వాత చూసిన బంధువులు గుర్తుపట్టలేక ఒకరికి బదులుగా మరొకరిని పిలుస్తున్నారు. ఫిబ్రవరి 22 కవలల దినోత్సవం సందర్భంగా పలువురు వారి అభిప్రాయాలు ‘సాక్షి’కి వెల్లడించారు. జమ్మికుంట పట్టణంలోని లెంకలపల్లి అశోక్, సునీత దంపతులకు మొదటి సంతానంగా ఇద్దరు ఆడపిల్లలు జన్మించగా ప్రత్యూష, ప్రణతి అని పేర్లు పెట్టారు. ఇద్దరిది ఒకే పాఠశాల, తరగతి, చదువులో, మార్కులు సాధించడంలో సమానంగా వస్తుండటంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన దుస్తులు ధరిస్తుంటారు. ప్రస్తుతం ఇద్దరు ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఐటీకి సంబంధించిన కోర్సు ఎంపిక చేసుకుంది మొదలు ఇద్దరు కలిసి మెలసి ఉంటారు. ఇద్దరికి ఫ్రెండ్స్ కూడా సమానం, కలివిడిగా ఒకే ప్రాణంగా ఉంటూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామంలోని సమ్మక్క సారలమ్మ జాతరకు శుక్రవారం రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొ లిసారి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

హార్వెస్టర్ మంజూరు

కరీంనగర్‌రూరల్: మండలంలోని దుర్శేడ్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో బొమ్మకల్‌కు చెందిన రైతు గోలి అరుణ్ నరేశ్‌కు గురువారం హార్వెస్టర్ మంజూరు చేశారు. ధర రూ.28 లక్షలుండగా లబ్ధిదారుడు తన వాటా కింద రూ.6 లక్షలు చెల్లించగా మిగతా మొత్తాన్ని రుణం కింద అనుమతించారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోండి

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం బాధిత కుటుంబాలతో కలిసి కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. తామంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారమని, గుడిసెలు కాలిపోయి నిలువ నీడ లేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం ద్వారా తగిన సాయం అందించాలని వేడుకున్నారు. వారికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని, అగ్ని ప్రమాద ఘటనపై దర్యాప్తు చేయాలని శ్రీనివాస్ కోరారు.



బాధితులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



అన్నదానం నిర్వహిస్తున్న వీహెచ్‌పీ బాధ్యులు.

బాధితులకు అన్నదానం

విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి సంస్థ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ అగ్ని ప్రమాద బాధితులకు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ బాధ్యులు వూట్కూరి రాధాకృష్ణారెడ్డి, పల్లి శైలజ–రవిచందర్, రాజేశ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, పండ్లు పంపిణీ

కరీంనగర్: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని ఆధ్వర్యంలో గురువారం దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వంట చేసుకోవడానికి సిలిండర్లు, స్టౌలు లేక బాధితులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి, వారికి సహాయం చేయాలని కోరారు. సంస్థ కోశాధికారి కర్రె రవి, సాయిళ్ల శ్రీను, మేకల దేవిక, సంద శివ తదితరులున్నారు.

డీఎస్పీ నాయకుల పరామర్శ

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను గురువారం ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా నాయకులు పరామర్శించారు. కలెక్టర్ స్పందించి, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, భూమి ఇవ్వాలని కో రారు. జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్, అధ్యక్షురాలు సాధ న, ప్రధాన కార్యదర్శి నరేశ్, నాయకులున్నారు.



దుస్తులు అందించిన ఆదరణ సేవా సమితి సభ్యులు

విజయవంతం చేయండి

విద్యానగర్: భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఆధ్వర్యంలో 27న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ కోరారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కనీస వేత న చట్ట సవరణ చేయకుండా ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆరోపించారు. తక్షణమే కనీస వేతన చట్ట సవరణ చేసి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.సుధీర్‌కుమార్, జిల్లా నాయకుడు శ్రీనివాస్, స్ట్రీట్ వెండర్ నాయకుడు ఆకుల తిరుపతి, మెడికల్ రిప్రజెంటేటివ్స్ నాయకులు ఆముదుర్తి రవి, మల్లేశ్ పాల్గొన్నారు.